క్లుప్తంగా

గ్రానైట్ లారీలు స్వాధీనం

బల్లికురవ: పర్మిట్ లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఐదు గ్రానైట్ లారీలను ఒంగోలు మైనింగ్ విజిలెన్స్ ఏడీ ఈరేష్ గురువారం బల్లికురవ సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించకుండా అక్రమంగా తరలించటం నేరమన్నారు. ఎంతటివారికైనా పెనాల్టీ తప్పదని ఆయన హెచ్చరించారు. అనంతరం గ్రానైట్ లారీలను బల్లికురవ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.

వెలుగు కార్యాలయంలో ఆడిట్



ఆడిట్ చేస్తున్న ఆడిటర్ సురేష్

జే.పంగులూరు: మండల పరిధిలోని పంగులూరు వెలుగు కార్యాలంలో గురువారం ఆడిట్ నిర్వహించారు. 2022–23కు సంబంధించిన గ్రామ సంఘాల లావాదేవీలను ఆడిటర్ కే సురేష్ క్షుణంగా పరిశీలించారు. మండల పరిధిలో మొత్తం 38 గ్రామ సంఘాలకు గాను 21 గ్రామ సంఘాలు ఆడిట్ జరిగినట్లు తెలిపారు. క్యాష్ బుక్, లెడ్జర్, వోచర్లు, సీఐఎఫ్ లోన్ల డాక్యుమెంట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎల్‌సీ విజయ్‌భాస్కర్, సీసీలు కామేశ్వరావు, దాసు, నరసింహరావు, అకౌంటెట్ భాస్కరమ్మ, వీవోఏలు పాల్గొన్నారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ



పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏఓ సుబ్బారెడ్డి

జే.పంగులూరు: ఖరీఫ్ సీజన్‌లో 2023–24కు సంబంధించి పచ్చిరొట్ట ఎరువులైన జనుము, జీలుగ విత్తనాలు 50 శాతం రాయితీ మీద ఇవ్వ నున్నట్లు ఏవో సుబ్బారెడ్డి గురువారం తెలిపారు. పచ్చి రొట్ట విత్తనాలు ఎకరాకు 10 కేజీల చొప్పున ప్రతి రైతుకు ఐదెకరాల వరకు ఇవ్వనున్నట్లు తెలిపారు. జీలుగలు కేజీ పూర్తి ఖరీదు రూ. 79 కాగా, సబ్సిడీపై రూ. 39.50 ఇవ్వనున్నట్లు తెలిపారు. జనుము రూ. 84 కాగా, రాయితీపై రూ. 42 లకు రైతులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు వారి పరిధిలోని రైతు భరోసా కేంద్రం వద్ద తీసుకోవాలని తెలిపారు. పట్టాదారు పాసు పుస్తకాలు, ఆధార్ తీసుకు వెళ్లాలని తెలిపారు.

ఎమ్మార్సీకి చేరిన విద్యాకానుక కిట్లు



పాఠ్య పుస్తకాలను తరగతుల వారీగా సర్దుతున్న సీఆర్పీలు

యద్దనపూడి: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభమైయ్యే నాటికి విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు సిద్ధంగా ఉండేలా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని మండల విద్యాశాఖాధికారి పుల్లెల సుబ్రమణ్యేశ్వరావు తెలిపారు. ఎమ్మార్సీ కార్యాలయానికి చేరుకున్న జగనన్న విద్యాకానుక కిట్లను ఆయన పరిశీలించారు. తరగతుల వారీగా పాఠ్యపుస్తకాలను సిద్ధంగా ఉంచాలని సిబ్బందిని సూచించారు. అలాగే విద్యాకానుక కిట్లలో పాఠ్యపుస్తకాలతో పాటు, యూనిఫాం, షూ కూడా వచ్చాయన్నారు. ఈ ఏడాది యూనిఫాం కలర్ కూడా మారాయన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు జీవన్, ప్రేమ్‌కుమార్, స్థానిక ఉపాధ్యాయులు ఉన్నారు.

అభివృద్ధిలో రయ్ రయ్..



రామకృష్ణాపురంలో జోరుగా జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణం



ప్రధాన రహదారికి అనుసంధానంగా నిర్మించిన రోడ్డు

- అభివృద్ధిలో రామకృష్ణాపురం ముందంజ
- రూ.198 లక్షలతో గ్రామంలో మౌలిక సదుపాయాలు
- గ్రామస్తుల్లో ఆనందం

చీరాల: గత ప్రభుత్వాలు గ్రామ పంచాయతీలను నిర్వీర్యం చేసి వ్యవస్థను భ్రష్టు పట్టించాయి. దీంతో గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించలేకపోవడంతో అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచాయి. కానీ నేడు ఆ పరిస్థితి నుంచి గట్టెక్కి పంచాయతీలు అభివృద్ధిలో దూసుకెళ్తున్నాయి. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి గ్రామ స్వరాజ్యానికి నాంది పలికాడు. చీరాల పట్టణానికి అనుకుని ఉన్న గ్రామం రామకృష్ణాపురం. చేనేతలు, రోజువారీ కూలీలు అధికంగా ఉన్న పంచాయతీ. గతంలో అరకొర వసతులతో ఉన్న ఈ గ్రామంలో ప్రస్తుతం అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులను సత్వరమే కల్పిస్తున్నారు నియోజకవర్గ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి. గతంలో మట్టిరోడ్లు, గుంతలు పడిన రోడ్లతో ఇబ్బందులు పడిన గ్రామస్తులు నేడు సిమెంట్ రోడ్లతో సర్రున దూసుకెళ్తున్నారు. గ్రామంలో ఎక్కడ చూసినా సిమెంట్ రోడ్లు, ఎల్‌ఈడీ బల్బులు, వీధులను ప్రధాన రహదారికి అనుసంధానం చేస్తూ ఏర్పాటు చేసిన రోడ్లతో గ్రామం అభివృద్ధి చెందుతోంది. గ్రామంలో ప్రధానంగా బొడ్డురాయి సెంటర్, పంచాయతీ కార్యాలయం రోడ్డు, హైమా హాస్పిటల్ రోడ్డు, బండపాలెం రోడ్డు, పాత డీఎస్పీ కార్యాలయం రోడ్డు తదితర రోడ్లు అన్నీ సిమెంట్ రోడ్లతో కళకళలాడుతున్నాయి. చీరాల మున్సిపాలిటీకి ఆనుకొని ఉన్న రామకృష్ణాపురంలో ప్రస్తుత అధికార లెక్కల ప్రకారం 6755 మంది జనాభా, 14 వార్డులు, 2940 నివాస గృహాలు ఉన్నాయి. నివాసాలు, జనాభా సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చకచకా అభివృద్ధి..

ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అభివృద్ధికి పెద్ద సంఖ్యలో నిధులు కేటాయించింది. సుమారు రూ.198.18 లక్షల నిధులు కేటాయించడంతో రోడ్లు, డ్రైనేజీలు, సచివాలయాలు నిర్మిస్తున్నారు. మూడొంతుల పనులు పూర్తి కాగా ఒక వంతు పనులు జరుగుతున్నాయి. ప్రధానంగా ఎమ్మెల్యే కరణం క్యాంపు కార్యాలయం ఉండటం, గ్రామంలో సమస్యలు ఉండటంతో వీటి పరిష్కారంపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించారు. ఎమ్మెల్యే చొరవతో రామకృష్ణాపురంలో రూ.150.18 లక్షలలో అభివృద్ధి పనులు పూర్తి చేయగా రూ.48 లక్షలతో పలు రకాల అభివృద్ధి పనులు తుదిదశలో ఉన్నాయి. ప్రభుత్వం నుంచి నిధులు తెప్పించి అభివృద్ధి చేస్తున్నారు. 14,15 ఆర్థిక సంఘ నిధులు, ఎమ్మెల్యే, ఎంపీ గ్రాంటు నిధులు, ఆర్‌డబ్ల్యూఎస్, ఉపాధి హామీ పథకం నిధులతో అభివృద్ధి పనులు గ్రామంలో ఎక్స్‌ప్రెస్ స్పీడ్‌లో జరుగుతున్నాయి. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక కృషి..



చీరాల పట్టణంతో పాటు నియోజకవర్గంలో గ్రామ పంచాయతీల్లో ఉన్న సమస్యలను పరిష్కరించి అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నా. రామకృష్ణాపురం గ్రామ పంచాయతీలో మౌలిక వసతులను ప్రజలకు అందించేందుకు చర్యలు చేపట్టా. ఇప్పటికీ మట్టిరోడ్లు, అధ్వానంగా డ్రైనేజీ ఉండడంతో ఈ పంచాయతీపై ప్రత్యేక దృష్టి సారించాం. మౌలిక వసతుల కల్పనకు రూ.2 కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి చేశాం.

–కరణం బలరామకృష్ణమూర్తి, ఎమ్మెల్యే, చీరాల

ఎమ్మెల్యే కృషి మరువలేనిది..

మా రామకృష్ణాపురం గ్రామ పంచాయతీ పట్టణానికి దగ్గర ఉన్నా మౌలిక వసతులు అంతంత మాత్రంగా ఉండేవి. జనాభా పరంగా మంచి పంచాయితీగా పేరున్నా అభివృద్ధి చెందలేదు. వసతుల కల్పనపై ప్రజలు పలుమార్లు అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయింది. ఈప్రభుత్వంలో ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి స్పందించి గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నారు. అందుకు మేము కృతజ్ఞతలు చెప్తున్నాం.

–దివి జయరాం, గ్రామస్తుడు

చంద్రబాబు వ్యాఖ్యలు సిగ్గుచేటు



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణచైతన్య, నాయకులు

- రాష్ట్ర శాప్‌నెట్ ఛైర్మన్ కృష్ణచైతన్య ధ్వజం

అద్దంకి రూరల్: పేద ప్రజలను అవమానించే విధంగా అహంకార పూరిత వ్యాఖ్యలు చేసిన చంద్రబాబు నాయుడుకు ప్రజలే తగిన బుద్ధి చెప్తారని రాష్ట్ర శాప్‌నెట్ ఛైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. అమరావతి పేదల ఇళ్ల స్థలాల పంపిణీపై చంద్రబాబు చేసిన అహంకార, దిగజారుడు వ్యాఖ్యలను ఖండిస్తూ స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద కృష్ణచైతన్య ఆధ్వర్యంలో గురువారం వైఎస్సార్ సీపీ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాప్‌నెట్ ఛైర్మన్ సీఎం జగన్ మోహన్‌రెడ్డి పేదలకు అందించే ప్రతి సంక్షేమ పథకాన్ని అడ్డుకోవటమే చంద్రబాబు ఓ పనిగా పెట్టుకున్నాడన్నారు. దళితులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు అంటే చంద్రబాబుకు చులకన అన్నారు. ఇళ్ల పట్టాలు ఇస్తే పేద ప్రజలు ఎక్కడ జగనన్నకు దగ్గరవుతారని భయంతోనే ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు తన వర్గీయులకు కట్టబెట్టిన భూములకు విలువ తగ్గుతుందనే అక్కసుతోనే పేదలను అవమానిస్తున్నారని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు చంద్రబాబుకు, లోకేష్‌కు తగిన బుద్ధి చెప్తారన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ జ్యోతి హనుమంతరావు, అద్దంకి మున్సిపల్ ఛైర్మన్ ఎల్ ఎస్తేరమ్మ, వైస్ ఛైర్మన్‌లు పద్మేష్, అనంతలక్ష్మీ, చిన్ని శ్రీమన్నారాయణ, సోని, సందిరెడ్డి రమేష్, వార్డు కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యుడు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి



ప్రజలతో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్

- నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్
- 'మీ కోసం ఈ రోజు' కార్యక్రమం ప్రారంభం

పర్చూరు (చినగంజాం): నియోజకవర్గంలోని ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తాను కృషి చేస్తున్నట్లు పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. ఇందుకోసం ఆయన 'మీ కోసం ఈ రోజు' అనే ఒక వినూత్న కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. మిగతా రోజుల్లో ఆయా మండలాల్లో పర్యటించి గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించినా నియోజకవర్గ కేంద్రంలో ఒక రోజు నియోజకవర్గ ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను తెలుసుకొని అక్కడికక్కడే పరిష్కరించే విధంగా ఆయన కార్యక్రమాన్ని రూపొందించారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి పర్చూరు ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో ప్రజలకు అందుబాటులో ఉన్నారు. పర్చూరు బొమ్మల సెంటర్‌లో గుంటూరు రోడ్డు పక్కన ఉన్న ప్రధాన డ్రైనేజీపై ఆక్రమణలను 15 రోజుల్లో స్వచ్ఛందంగా తొలగించాలని ఆక్రమణదారులను ఆయన కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కఠారి అప్పారావు, వైఎస్సార్ సీపీ నాయకులు మల్లా శ్రీనివాసరావు, ఎర్రాకుల తిరుమలేశ్వరరావు, నరిశెట్టి విపిన్ బాబు, కాకర్లమూడి చిన్నయ్య, లంకా శివ, తోకల కృష్ణమోహన్, గాదె సురేష్, ఆకుల హేమంత్, జంగా అనిల్, షేక్ కాలేషా, ఉప్పలపాటి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం



లబ్ధిదారుడికి బుక్‌లెట్ ఇస్తున్న శాప్‌నెట్ ఛైర్మన్ కృష్ణచైతన్య

- శాప్‌నెట్ ఛైర్మన్ కృష్ణచైతన్య

మేదరమెట్ల: పేదరికాన్ని నిర్మూలించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారని, అందులో భాగంగానే ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టారని శాప్‌నెట్ ఛైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మూడో రోజు గురువారం కొరిశపాడు మండలంలోని దైవాలరావూరు గ్రామంలో కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు చెందిన బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందించి వివరించారు. స్థానిక సమస్యల గురించి తెలుసుకుంటూ ముందుకు సాగారు. కార్యాక్రమంలో ఎంపీపీ సాదినేని ప్రసన్నకుమారి, గుండపనేని ఆనంద్, నరశింహారావు, ఎం.రమణయ్య, ఎస్.మస్తాన్‌రావు, వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాత కలప వేలం నేడు

అద్దంకి: స్థానిక పాత పోలీస్ స్టేషన్‌ను తీసేవేసే క్రమంలో అందులో వచ్చిన పాత కలప (టేకు) దుంగలకు వేలం నిర్వహించనున్నారు. జిల్లా ఫారెస్ట్ అధికారులచే ధరను అంచనా వేయించారని పోలీసు అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కలపను నేడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వేలం నిర్వహిస్తారని, వేలంలో పాల్గొనాలనుకునే వారు హాజరు కావాలని పోలీసులు ప్రకటనలో కోరారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

పర్చూరు (చినగంజాం): మండలంలోని నూతలపాడు గ్రామంలో గురువారం పేకాట శిబిరంపై ఎస్సై ఎస్ చెంచుప్రసాద్ తన సిబ్బందితో కలిసి దాడి నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.10,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి వారిని శుక్రవారం కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్సై తెలిపారు.

ఏపీఈఏపీ సెట్ పరీక్షకు 409 మంది హాజరు

వేటపాలెం: సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల్లో జరిగిన ఏపీఈఏపీ సెట్–2023 పరీక్షలకు 409 మంది విద్యార్థులు హాజరైనట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు గురువారం ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు బైపీసీ, విద్యార్థులకు 22 నుంచి 23 వరకు ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వ హిస్తున్నారని తెలిపారు. మొత్తం 430 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావల్సి ఉండగా 21 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ ఎం వేణు గోపాలరావు తెలిపారు.

సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం వద్దు



కారంచేడులో రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటరత్నం



చీరాలలో సూచనలందిస్తున్న ఎంపీడీవో నేతాజీ

కారంచేడు: ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించాల్సిన బాధ్యత సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లపై ఉందని తహసీల్దారు ఎస్ వెంకటరత్నం అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రమైన కారంచేడు-3 సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని రైతులకు, విద్యార్థులకు అవసరమైన అర్జీల పరిష్కారంలోను సిబ్బంది ముందుండాలన్నారు. వారి నుంచి స్పందనకు వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించుకోవాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ అరుణ, జగదీశ్వరి, వీఆర్‌ఓలు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చీరాల టౌన్: ప్రభుత్వం అందించే పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించే బాధ్యత అధికారులపై ఉందని ఎంపీడీవో కె.నేతాజీ సూచించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని అన్నీ సచివాలయాల సెక్రటరీలు, వివిధ శాఖల ఉద్యోగులతో ఎంపీడీవో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సమావేశంలో ఈవోఆర్డీ మురళీ బాపూజీ, ఉద్యోగులు, పంచాయతీల సెక్రటరీలు ఉన్నారు.

గంజాయి అమ్మకాలు చట్టరీత్యా నేరం



ప్రజలతో మాట్లాడుతున్న సీఐ సూర్యనారాయణ, ఎస్సై సురేష్

చినగంజాం: గంజాయి అమ్మకాలు సాగించడం చట్టరీత్యా నేరమని ఇంకొల్లు సీఐ వీ సూర్యనారాయణ అన్నారు. గురువారం రాత్రి మండలంలోని మోటుపల్లి గ్రామంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని సీతారామాలయంలో ప్రజలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి అమ్మడం, తీసుకోవడం నేరం అని వాటికి దూరంగా ఉండాలని ఆయన సూచించారు. అదే విధంగా గ్రామాలలో దేవాలయాలు, నివాస గృహాల్లో దొంగతనాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎస్సై కే సురేష్, గ్రామ కాపులు, పెద్దలు పాల్గొన్నారు.

చేనేత వృత్తి రక్షణ కోసం ఐక్య ఉద్యమం



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

చీరాల: వ్యవసాయ రంగం తర్వాత రెండో అతిపెద్ద రంగమైన చేనేత రంగం రక్షణకు ఐక్య ఉద్యమాలు అవసరమని చేనేత సంఘాల రాష్ట్ర నాయకులు పేర్కొన్నారు. గురువారం చీరాల పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో చేనేత సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి చేనేత నాయకులు రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈసమావేశానికి రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన చేనేత సంఘాల ప్రతినిధులు మల్లికార్జున, వై.కోటేశ్వరరావు, ఎం.మోహనరావు, బాలకృష్ణ, నాగేశ్వరరావు, కొండయ్య, సుబ్బారావు, అధిక సంఖ్యలో చేనేత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చేనేత నాయకులు మాట్లాడుతూ చట్టసభల్లో ఉన్న చేనేత సామాజిక వర్గం ప్రజాప్రతినిధులు చేనేతల సమస్యల పరిష్కారానికి, చేనేతల సంక్షేమానికి పాటుపడాలన్నారు. చేనేతలకు అవసరమైన నూలు, పట్టు, జరీ, రంగులు, రసాయనాలను ప్రభుత్వమే 40 శాతం సబ్సిడీతో అందిస్తే చేనేతలకు ఎనలేని మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన చేనేత సంఘాల ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరంతో మేలు

మార్టూరు: మార్టూరు శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కథలు చదివించటం, చెప్పించటం, పాటలు, పద్యాలు, క్యారం బోర్డు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు పావులూరి జానకి రామారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధ్యతలు గుర్తెరిగి పనిచేయాలి



ఉద్యోగులతో మాట్లాడుతున్న తహసీల్దార్

బల్లికురవ: ప్రభుత్వం గ్రామాల్లోని ప్రజలకు పౌర సేవలందించేదుకు సచివాలయ వ్యవస్థలో పనిచేస్తున్న వివిధ శాఖల ఉద్యోగులు బాధ్యతలు గుర్తెరిగి అంకిత భావంతో పనిచెయ్యాలని తహసీల్దార్ జీవి సుబ్బారెడ్డి కోరారు. గురువారం వైదన సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. అటెండెన్స్, మూమెంట్, స్పందన రిజిస్టర్‌లను తనిఖీలు చేసి సంతృప్తి చెందారు.